క్లుప్తంగా

ముగిసిన ఉచిత శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న బాలురు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర గృహంలో బాలురకు నవరస థియేటర్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నటనలో అందించిన ఉచిత శిక్షణ శుక్రవారం ముగిసింది. ఇక్కడ మూడు వారాలపాటు ఆసక్తి గల బాలురకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ మునీర్ ముషీద్ మాట్లాడుతూ క్రమశిక్షణ, సంకల్పం ఉంటే విజయాలు సాధించవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. ఇలాంటి శిక్షణ వల్ల బాలురలో క్రమశిక్షణ, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాశం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ సంస్థ కో కన్వీనర్ విశాలాక్షి, బాలుర గృహం పర్యవేక్షణాధికారి రమణ, సంస్థ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, యశ్వంత్, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



విజేతలతో వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం : కళలను నిరంతరం ప్రోత్సహించాలని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లలిత్ కళా అకాడమీ భువనేశ్వర్, తంజావూర్‌లోని సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ శుక్రవారం ఏయూ చిత్రకళా విభాగంలో నిర్వహించిన వికసిత్ భారత్ కే రంగ్, కళా సే సంగ్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. ఏయూ విద్యార్థులు చిత్రలేఖనం, నృత్యం, సంగీతం నేర్చుకునేలా ఒక మాడ్యూల్ తయారు చేసి అమలు చేస్తామని చెప్పారు. అనంతరం విజేతలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం, బీవోఎస్ చైర్మన్ శ్రీనివాస్, తంజావూర్‌లోని సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.రంగ భాష్యం, ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

సామూహిక భక్తి గానం నేడు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కళాభారతి ఆడిటోరియంలో అంతా రామమయం సామూహిక భక్తిగానం నిర్వహిస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఆకొండి వెంకటరావు నిర్వహణలో 70 మందికిపైగా కళాకారులు భక్తితో శ్రీరామనామ కీర్తన చేయనున్నారని పేర్కొన్నారు. శ్రీరామ నామామృత గానాన్ని ఆలకించి పులకించేందుకు అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

ఉచిత చిత్ర ప్రదర్శన 23న

మద్దిలపాలెం : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న మంగళవారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో స్థనార్థ శ్రీకుట్టం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామని సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు తెలిపారు. చక్కటి సందేశాత్మక చిత్రాన్ని మలయాల దర్శకుడు వినేష్ విశ్వనాథ్ రూపొందించి అవార్డులు పొందారని తెలిపారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని తెలిపారు.

స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ



స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: 'స్వచ్ఛతా హీ సేవా – 2025' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన స్వచ్ఛోత్సవ్ పోస్టర్లను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17న ప్రారంభమై అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయని డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. వీటిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో రోడ్డు పక్కన తొలగిస్తున్న బడ్డీలు



ఆరిలోవ వెళ్లే రోడ్డుపై బైఠాయించిన బడ్డీల నిర్వాహకులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

చిరు వ్యాపారులపై
బ్రహ్మాస్త్రం



పెదగదిలి వద్ద బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- ఆరిలోవలో రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన బడ్డీల తొలగింపు
- ఒక్కసారిగా వీధిన పడేయ వద్దని వేడుకున్న చిరు వ్యాపారులు
- జీవీఎంసీ అధికారులు, సిబ్బందితో కొద్దిసేపు వాగ్వాదం
- అనంతరం రోడ్డుపై బైఠాయించినా ఆగని తొలగింపుల పర్వం
- బడ్డీల నిర్వాహకులు ఫోన్లు చేసినా... ఇళ్లకు వెళ్లినా పత్తాలేని టీడీపీ నాయకులు
- కూటమి పాలనలో తగిన శాస్తి జరిగిందని చిరు వ్యాపారుల ఆవేదన

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో పేదల **జీవనాధారాన్ని** కూటమి పాలకులు దెబ్బ **తీశారు. ఎన్నో** ఏళ్లుగా కుటుంబ పోషణకు చేదోడు**గా నిలిచిన** బడ్డీలను తొలగించి చిరువ్యాపారు**లను రోడ్డున** పడేశారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప**క్కన నిర్వహి**స్తున్న బడ్డీలను జీవీఎంసీ అధికారు**లు శుక్రవారం** తొలగించేశారు. ప్రధాన రహదార్లు పక్కన అనధికారికంగా నిర్వహిస్తున్న అన్ని బడ్డీలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జోన్ – 2 జెడ్సీ కనక మహాలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, సచివాలయాల సిబ్బందితో ఉదయం ఆరిలోవ ప్రాంతానికి చేరుకుని ప్రధాన రహదారిని పరిశీలించారు. ఆరిలోవ పోలీసుల సహకారంతో అంబేద్కర్ కూడలి నుంచి దుర్గాలమ్మ గుడి వరకు, పెదగదిలి గెడ్డ పక్కన అనధికారికంగా ఏర్పాటు చేసిన సుమారు 40 బడ్డీలను తొలగించారు. దీంతో బడ్డీల తొలగింపును బాధితులు అడ్డుకున్నారు. అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మేం ఎన్నో ఏళ్లుగా బడ్డీలు పెట్టుకొని కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఒక్కసారిగా మమ్మల్ని వీధిన పడేస్తున్నారంటూ లబోదిబోమన్నారు. మా బడ్డీలను తొలగించొద్దని వేడుకున్నారు. దీంతో కొంతసేపు బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు ససేమిరా అనడంతో రోడ్డుపై బాధితులు బైఠాయించి హడావిడి చేశారు. దీంతో గందరగోళం మధ్య కొంతసేపు తొలగింపు నిలిచిపోయింది. జీవీఎంసీ అధికారులు ఇచ్చిన సమాచారంతో ఆరిలోవ పోలీసులు అక్కడకు చేరుకుని బైఠాయించిన వారిని నివారించారు. అనంతరం జీవీఎంసీ అధికారులు వారి పని వారు చేసుకుపోయారు. మాకు కనీసం ముందుగా నోటీసులు ఇవ్వలేదని, ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చి బడ్డీలు తొలగించడంతో నష్టపోయామంటూ బాధితులు అధికారులపై మండిపడ్డారు.



ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



ఆరిలోవ ప్రాంతంలో బడ్డీలు తొలగిస్తుండడంతో నిలిచిపోయిన వాహనాలు

కానరాని టీడీపీ నాయకులు

ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం ఉదయం నుంచి గంటలు తరబడి బడ్డీల తొలగింపు కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ అధికారులు, పోలీసులు, అన్ని సచివాలయాల సిబ్బందితో ఈ ప్రాంతంలో హడావిడి కనిపించింది. అయినప్పటికీ అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు మాత్రం ఎవ్వరూ కానరాలేదు. బాధితులు స్థానిక నాయకులకు ఫోన్లు చేసినా ఎవ్వరూ స్పందించ లేదు. వారి ఇళ్ల వద్దకు వెళ్తే కనిపించలేదు. దీంతో అందరూ కలిసి ఆటోల్లో ఎంవీపీ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే లేరని.., అసెంబ్లీ సమావేశాలకు అమరావతి వెళ్లారని తెలుసుకుని తిరిగి ఆరిలోవ చేరుకున్నారు. ఓట్లు వేయించుకోవడానికి అనేక సార్లు ఇళ్ల చుట్టూ తిరిగిన నాయకులు ఇప్పుడు మాకు సహాయం చేయాల్సి వస్తుందని కనిపించకుండా పోయారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నాయకులను నమ్ముకున్నందుకు కూటమి ప్రభుత్వ పాలనలో తగిన శాస్తి జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు భాష పరిరక్షణకు ప్రజా ఉద్యమం



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తెలుగుదండు ప్రతినిధులు

మద్దిలపాలెం : తెలుగు భాష పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట తప్పారని... అందుకే ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలుగు దండు వ్యవస్థాపకుడు పరవస్తు సూరి తెలిపారు. మద్దిలపాలెంలోని తెలుగు తల్లి విగ్రహానికి శుక్రవారం నీరాజనాలు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి వెళ్లి అసెంబ్లీ వద్దే గాంధేయ మార్గంలో నిరసన తెలిపి పాలకుల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఉద్యమంలో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇలానే వదిలేస్తే భవిష్యత్ తరాలకు అప్పట్లో తెలుగు ఉండేదని చెప్పే పరిస్థితి వస్తుందన్నారు. పూర్తిగా మన సంస్కృతి నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషాభివద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు, గౌరవం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలందరూ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలనా వ్యవహారాలు తెలుగులో సాగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. వీటి కోసం పోరాడాల్సి రావడం విచారకరమన్నారు. అయినప్పటికీ పాలకులు తెలుగు భాషకు పెద్ద పీట వేసే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

స్నాతకోత్సవం సమర్థంగా నిర్వహించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని సమర్థంగా నిర్వహించాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. స్నాతకోత్సవ నిర్వహణపై వివిధ కమిటీల సభ్యులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రిసెప్షన్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీ, సైటేషన్ కమిటీలకు కేటాయించిన బాధ్యతలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. స్నాతకోత్సవ మందిరానికి అవసరమైన మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశించారు. అందరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారి సంఖ్య, అవార్డులు, మెడల్స్ వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు.

నగదు బహుమతులను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆన్ డ్యూటీ పాసులు మంజూరు చేయాలని సూచించారు. సబ్ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జెడ్సీ కార్యాలయం ఎదుట వ్యాపారుల బైఠాయింపు



జెడ్సీ చాంబర్ ఎదుట బైఠాయించిన చిరు వ్యాపారులు

మధురవాడ: రోడ్డు పక్క ఉన్న చిల్లర దుకాణాలు, తోపుడు బళ్ల తొలగింపుపై చిరు వ్యాపారులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ అనుబంధ విశాఖ తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం ఆధ్వర్యంలో జోన్–2 కమిషనర్ చాంబర్ ఎదుట శుక్రవారం బైఠాయించారు. ముందుగా మిధిలాపురి వుడా కాలనీ, కారుషెడ్, చంద్రంపాలెం మీదుగా మధురవాడ జోనల్ ఆఫీసు వరకు బ్యానర్లు, జెండాలతో ర్యాలీగా వచ్చి, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం జెడ్సీ చాంబర్ ఎదుట బైఠాయించి అధికారుల నిరంకుశ ధోరణి, ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినదించారు. సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు మాట్లాడుతూ దుకాణాల తొలగింపు కారణంగా సుమారు 500 మంది వ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. వీరి రాకను గమనించిన అధికారులు ఆఫీసుకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పేంత వరకు కదలబోమంటూ వారు మధ్యాహ్నం వరకు బైఠాయించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదినారాయణ, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



ఫుట్‌పాత్‌పై పెట్టిన తోపుడు బండిని సిబ్బందితో తీయిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిధిలాపురి వుడా కాలనీ రోడ్డులో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ వ్యాపారులు యథావిధిగా వ్యాపారాలు నిర్వహించడంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ఈ రోడ్డులో పర్యటించారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేసినా, ఆక్రమణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని టీపీవో శ్రీలక్ష్మిని ఆదేశించారు. ఉదయం 7గంటల లోపే పారిశుధ్య పనులు పూర్తి చేయాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించినా పూర్తి చేయక పోవడంపై మండిపడ్డా రు. ముందు రోజు ఆక్రమణలు తొలగించినా ఇంకా చెత్త అక్కడే ఉందని, తక్షణమే పారిశుధ్య పను లు పూర్తి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ని ఆదేశించారు. పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు, వాహనదారుల కోసం విశాలమైన రోడ్లను ఏర్పాటు చేశారని, వాటిని ఆక్రమణలకు పాల్పడవద్దని తెలిపారు. ఆయన వెంట జెడ్సీ కనక మహాలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో శనివారం 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. దీంతో సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్ – 2, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ బి.సింహాచలం నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 1, సెక్టార్ – 2, సెక్టార్ – 3లతోపాటు వెంకోజీపాలెం పెట్రోల్ బంక్, కరాచీ బేకరీ, మహాత్మ గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఎంవీపీ కాలనీలోని 33 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

2 వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలి



బాపూజీనగర్ యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వర రావు పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, స్వర్ణభారతి స్టేడియం సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ ఐడీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, గర్భిణులకు అందిస్తున్న వైద్యం, క్యాన్సర్ పరీక్షలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగించాలని, మాతా శిశు సేవలు, గర్భిణులకు వైద్య సేవలు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయనతోపాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు రైల్వే కార్మికుల ధర్నా

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ పి.రామమోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహనరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, రైల్వే కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రైవేటైజేషన్, ఔట్‌సోర్సింగ్ విధానాలకు వ్యతిరేకంగాను, అన్ని విభాగాల్లోని ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు కీలకంగా నిలిచిన ఇంజినీరింగ్ ట్రాక్‌మెన్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్‌కు మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్ అమలు చేయాలని కోరారు. ఎల్‌డీసీ, జీడీసీ ద్వారా సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని, వాటిలో ఇంజినీరింగ్ కార్మికులకు అవకాశం కల్పించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం డివిజనల్ రైల్వే మేనేజర్ ద్వారా రైల్వే బోర్డు చైర్మన్‌కు మెమోరాండం సమర్పిస్తున్నట్లు రామమోహనరావు తెలిపారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు డీఆర్‌ఎం లలిత్ బోహ్రాకు మెమోరాండం సమర్పించారు. ధర్నాలో జోనల్ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.ఎస్.రావు, కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

బృందంగా పనిచేస్తే ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో మంచి ర్యాంక్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అందరూ సమష్టిగా బృందంగా పనిచేస్తే భవిష్యత్‌లో మెరుగైన ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంక్ సాధించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభాగం నుంచి విశ్వవిద్యాలయం వరకు ఒక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న దానికంటే మెరుగైన ర్యాంకు సాధించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులకు సూచించారు. ఏయూ అవుట్ రీచ్ డీన్ ఆచార్య కె.రమాసుధ మాట్లాడుతూ ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ అందించే సమయంలో పరిగణనలోకి తీసుకునే అంశాలను వివరించారు. విదేశీ ఆచార్యులను స్వాగతించడం, పరిశోధనల్లో ప్రగతి, చొరవ చూపడం, రీసెర్చ్ ప్రాజెక్టులను సాధించడం ఎంతో ప్రధానమని తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రభుత్వ స్థలానికి రక్షణ గోడ నిర్మాణం



ఎర్నిదుర్గమాంబ గుడి పక్కన పశు సంవర్థక శాఖ స్థలానికి గోడ నిర్మాణం కోసం తవ్విన గొయ్యి

ఆరిలోవ : తోటగరువు, పెదగదిలి ప్రాంతంలో ఉన్న పశు సంవర్థక శాఖ స్థలాలు కొన్నాళ్లుగా ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ స్థలాల సంరక్షణలో భాగంగా ఆ శాఖ అధికారులు గురువారం నుంచి రక్షణ గోడ నిర్మాణ పనులు ప్రారంభించారు. అధికారులపై స్థానిక నాయకులు ఒత్తిడి చేస్తుండడంతో ఆ శాఖ స్థలాలు ఇక్కడ ఆక్రమణకు గురయ్యాయి. పెదగదిలి గెడ్డ – ఎర్నిదుర్గమాంబ ఆలయం మధ్యలో పశు సంవర్థక శాఖకు చెందిన సుమారు 1500 చదరపు గజాల స్థలాన్ని కొందరు శివాలయం నిర్మాణం పేరుతో ఆక్రమించారు. అధికారులు కొన్ని నెలల క్రితం ఆ స్థలం స్వాధీనం చేసుకున్నారు. దాని చుట్టూ రక్షణ గోడ నిర్మించడానికి రెండు రోజులుగా పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం పనులు జరుగుతుండగా స్థానికులు అక్కడ శివాలయం నిర్మిస్తామని, ఇది మా పూర్వీకులకు చెందిన స్థలమంటూ పనులు జరగకుండా అధికారులను అడ్డుకున్నారు. దీంతో పశు సంవర్థక శాఖ అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఆ స్థలానికి చెందిన డాక్యుమెంట్లు ఉంటే తీసుకురావాలని అడగడంతో అక్కడి నుంచి వారంతా వెళ్లిపోయారు. దీంతో రక్షణ గోడ నిర్మాణ పనులు అధికారులు చేపడుతున్నారు. తమ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూసేందుకు తోటగరువు వద్ద వెటర్నరీ ఆస్పత్రి వెనుక ఖాళీ స్థలానికి కూడా రక్షణ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు పశు సంవర్థక శాఖ అధికారులు తెలిపారు.

దసరా మహోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దుర్గా మల్లేశ్వరి ఆలయ ప్రతినిధులు

టీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు రామనగర్ సమీపంలోని దుర్గా మల్లేశ్వరి ఆలయంలో దసరా మహోత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి సంఘం ప్రతినిధులు తెలిపారు. దసరా మహోత్సవాలకు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను ఆలయ చైర్మన్ మార్గాన వెంకటేశ్వరరావు, రాజ్ గౌడ్ శుక్రవారం ఆహ్వానించారు. ఉత్సవాల తొలి రోజైన సోమవారం ఉదయం అమ్మవారి విగ్రహం ఊరేగిస్తామని తెలిపారు. అదే రోజు రాత్రి 7 గంటలకు సేవ గరిడి నిర్వహిస్తామన్నారు. అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. ఆలయం వద్ద పులివేషాలు, కాళీమాత డ్యాన్స్, తప్పెటగుళ్లు, కేరళ డప్పులు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారిని 108 ఘటాలతో ఊరేగింపు జరుపుతామని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.